"తా....త....య్యా" తాత నేర్పిన ఏ అక్షరసత్యాలో నానీ మనస్సును తొలిచేస్తుంటే నెమ్మదిగా పిలిచాడు.

మరో లోకంలోనుంచి వినబడినట్టుగా వుంది.

మరోసారి పిలుస్తూ నెమ్మదిగా తట్టాడు.

శక్తిని కూడగట్టుకుని తల తిప్పిన తాతయ్యావేపు నిబ్బరంగా చూడగలిగింది ఒక్క క్షణమే! ఆ తర్వాత వెక్కిపడుతూ చుట్టుకుపోయాడు.

ఆ పెనుగులాటలోనే అమ్మేం చెప్పిందీ తెలియపరిచాడు.

"అమ్మెందుకబద్ధం చెప్పింది తాతయ్యా? నూరుగురు కొడుకులన్నా ఒక నిజం గొప్పదంటే.... మరెందుకు అబద్ధం చెప్పింది."

నిలదీసి అడుగుతుంటే విశ్వేశ్వరశాస్త్రి గొంతు మూగపోయింది.

ఏమని బదులివ్వగలడు.

నిశ్శబ్దంగా రోదిస్తున్నాడాయన కూడా.

సరిగ్గా ఆ సమయంలో ఓ వ్య క్తి లోపలికి వచ్చాడు పోలీస్ యూనిఫారంలో

"నానీ అంటే నువ్వేనా" యస్సై యశస్వి అడిగాడు.

నానీ భయపడుతుంటే పైకెత్తుకుని "మీ అమ్మగారు నిన్ను చూడాలనుకుంటున్నారు" అన్నాడు జీపు దగ్గరకి తీసుకు వెళుతూ....

పాతికేళ్ళ వయసుగల యశస్విని మొదటి చూపులోనే ఆకట్టుకున్నాడు నానీ.

నానీ తేరుకునే వరకూ యశస్వి మాట్లాడలేదు.

మరో అయిదు నిముషాల్లో జీపు హాస్పిటల్ చేరుతుందనగా "రాత్రంతా నిద్రపోలేదా నానీ" అడిగాడు మామూలుగా.

"అవును" తలుపాడు- "అమ్మలేదుగా?"

"అంటే మరి అన్నం తినలేదా?"

తల అడ్డంగా వూపాడు.

"పాలు...."

"నేనస్సలు తాగనుగా!"

"అంటే కాఫీ

తాగుతావన్న మాట"

"అహ.... చెడ్డలవాటుగా"

యశస్వి ఆలోచన తేనెతుట్ట అక్కడే కదిలింది.

ప్రిలిమినరీ ఇన్వెస్టిగేషన్ లో తాము కేకలు విని నిద్రలేచామని చెప్పిన కాంతమ్మ, చంద్రం, సరళల స్టేట్‌మెంట్సుకీ మరణ వాంగ్మూలంలో కొడుక్కి పాలివ్వాలని వెళితే వంటగదిలో ప్రమాదం జరిగిందని చెప్పిన పావని మాటలకీ ఏదో 'గేప్' కనిపిస్తుంది.

మరో రెండు నిముషాలలో నానీని హాస్పిటల్ దగ్గర దించిన యశస్వి చేతులు ముడుచుక్కూచోలేదు.

మరో వాస్తవాన్ని సకాలంలో వెలికి తీసే ప్రయత్నంగా మేజిస్ట్రేట్ కోసం జీపును వేగంగా కదిలించాడు.

గదిలోకి నానీ ఒక్కడ్నే పంపారు డాక్టర్లు.

అది ఆమె చివరి కోరిక.

లోపలికి బితుకుమంటూ అడుగుపెట్టిన నానీ బడినుండి వచ్చేటప్పుడు చేతులు చాచిన అమ్మ ఒడిలోకి లంఘించేటంత వేగంగా వెళ్ళలేదు.

అడుగు చప్పుడైతే అమ్మ నిద్ర చెడిపోతుందేమో నన్నంత నెమ్మదిగా ఏ పులిరక్కసి వాతపడో చివరి శ్వాస పీల్చుకునే తల్లి ఆవుని చేరి పాలు తాగాలనుకునే లేగదూడలా అతి నెమ్మదిగా నడిచాడు.

బెడ్‌పై అమ్మ గుడిలో కాలిన సీతమ్మ విగ్రహంలా కనిపిస్తుంటే "అ....మ్మా...." అని పిలిచాడు కాని దు:ఖం గొంతు కడ్డంపడి గుండెలోనే సమాధైపోయింది.

"అమ్మా....ఏంటిదే...." చైతన్యాన్ని కోల్పోయి రెప్పలు మూసుకుని వున్న అమ్మని తట్టబోయి వెక్కిపడుతూనే భయంతో నిగ్రహించుకున్నాడు.

అమ్మ పొట్టపై కూర్చుని అప్పుడెపుడో పాలుతాగిన గుండెలు కసరి కాలిన రాక్షస బొగ్గుల్లా కనిపించాయి.

ఒంటికి నలుగురాసిన చేతులు ఎముకల్లా వేలాడుతుంటే తన స్నానానికి అడ్డాళ్లుగా మారిన కాళ్లు రాయీరప్పల క్రింద నలిగిన వెదురు కర్రల్లా నజ్జయిపోయి వున్నాయి.

రక్తం

నీరుగా మారి కళ్ళనుంచి ఉబికి వస్తుంటే ఊపిరి వేడిసెగలై పావన్ని తాకి తట్టిలేపింది.

మృత్యువుతో మొరాయించి మరికొన్ని నిముషాలు బ్రతుకు పొడిగించుకున్నట్టు కళ్ళు తెరిచింది.

"నాన్నా, నా వరాలకొండా.... నా బంగారు తండ్రి...." ఆమె పెదవులు అదురుతున్నాయి ఉద్వేగంగా. కాని గొంతు పెగలడంలేదు.

"వెయ్యి నోముల ఫలంలా నా బ్రతుకు వాకిట నిలిచిన నా చిన్ని తండ్రీ...అయిపోయిందమ్మా...నా కల పూర్తి కాకముందే కాలం చెల్లిపోతూంది. కాని ఏం చేయను. బ్రతకాలనుంది. ఈ చిన్ని కొండ ఎన్నెన్ని శిఖరాలు ఎక్కుతాడో తాతను మించిన మనవడై ఎంతెంత కీర్తిని సంపాదిస్తాడో చూడాలనుంది కాని- ఏదీ చీకటిలోనైనా సాగిపోతే చాలనుకున్న నా బ్రతుకుకిలా తెల్లారిపోయిందే...." మంటల్లో ఆవిరికాగా మిగిలిన నీరు కన్నీరై, వరదై, వెల్లువై ఆమె గాజు కళ్ళలో నుండి రాలిపడి నానీ చేతుల్ని తడిపేస్తోంది.

ఎంతెంతో చెప్పాలనుంది ఆమెకు.

లేని అమ్మను తలచుకుని కుమిలిపోతూ కన్ను మూయవద్దని కళ్ళు తెరిచి లోకాన్ని చూస్తూ కలకాలం బ్రతకాలని చెప్పాలని వుంది.

ఏంటీ....?

నోరు పెగలడంలేదు.

శక్తి ఉడిగిపోతుందేమిటీ?

"ఆ....మ్మా...." పెదవులతో తల్లి కళ్ళనద్దుకున్నాడు. అప్పుడెప్పుడో ఏటి ఒడ్డున చూసిన కాలుతున్న శవం గుర్తుకురాగా అమ్మని సందిట బంధించేసి ఎవరొచ్చినా ఇవ్వకూడదన్నట్టు చేతుల్తో అమ్మ మెడని సుతిమెత్తగా చుట్టేశడు "ఎందుకమ్మా 'సత్యంవధ'న్నావ్.... టీచర్ నన్ను కొట్టినా నిజమే చెప్పాలన్నావ్.... నువ్వెందుకమ్మా అబద్దం చెప్పావు.... ఇన్ని చెప్పిన నువ్వే మాటెందుకు తప్పావమ్మా"

మరణం కన్నా నానీ మాటలు ఆమెను మరింత భయపెట్టాయి.... ఇప్పుడిక బదులివ్వకపోతే నానీ తను కోరని గమ్యం వేపు మరలిపోతాడని భయపడింది.

దేవుళ్లకే మొక్కుకుందో మృత్యువుకే చివరగా అర్థించిందో "నాన్న... కొన్ని నువ్వే తెలు....సు....కోవాలి...."

నాని విస్మయంగా వింటున్నాడు వెక్కిళ్ళతో.

"నాన్న...నేనంటే నీకు బోలెడంత ప్రేమకదూ....! "

తలూపాడు.

"అమ్మ ఏం చెబితే అది చేస్తావు కదూ!"

"ఆ-"

"నా..న్నా...నేనెందుకు అబద్ధం చెప్పానని అడుగుతున్నావు కదూ.... దానికి నీకు జవాబు తెలియాలంటే...నేనిచ్చే ఓ లెక్కకి జవాబు తెలుసుకోవాలి....? అది తాతయ్యనడిగి కాదు. నీ అంతట నువ్వు తెలివితో.... తెలుసుకుని తాతయ్యకు చెప్పి తెలివిలో తాతయ్య అంతటివాడివి కావాలి" బాధతో మెలికలు తిరిగిపోతుంది.

"నీ మీదొట్టమ్మా- తాతయ్యకి చెప్పను. నేనే తెలుసుకుంటాను." హామీ ఇచ్చాడు దృఢంగా.

పావని మొహంలో క్రమంగా ప్రేతకళ ఆవరిస్తోంది "తనకు కాచిన కాయి రాలితే....కొమ్మ బాధపడదు కాని అమ్మ మాత్రం కంటతడిపెడుతుందట. అమ్మ కొమ్మ అయితే ఆ కొమ్మెందుకు కన్నీరు పెట్టుకోదు? జవాబు తెలుసుకోవాలి. ఆ" ఏకగ్రతగా విన్న నానీ మరోసారి మననం చేసుకున్నాడు ఏకసంథాగ్రాహి అయినా....

వెంటనే చెప్పేయాలని విశ్వప్రయత్నం చేశాడు. కాని తోచలేదు.

అనుమానం అడ్డురాగా అడగాలని అమ్మకేసి చూశాడు.

"అ...మ్మా...."

నానీ ఆక్రందనతో ఆ గది ప్రతిధ్వనించిపోయింది. అంతా పరిగెత్తుకొచ్చారు.

కాని అప్పటికే బ్రతికినంతకాలం చస్తూనే వున్న పావని చచ్చి బ్రతికిపోయింది.

తల్లికోసం నానీ పడుతున్న తపన చూసిన డాక్టర్లు సైతం ఆ సన్నివేశాన్ని జీర్ణించుకోలేకపోయారు.

"ఒక జీవితకాలం లేటు" గొణిగాడు అప్పుడే మేజిస్ట్రేట్‌తో అక్కడ అడుగుపెట్టిన యశస్వి.

ఒక పోలీసాఫీసరుగా కాదు,

ఒక పసికందుగా మారి ఆ స్థితిని బేరీజు వేసుకుంటున్నాడు.

"అయిపోయింది" మేజిస్ట్రేటు తిరిగి వెళుతుంటే నానీనే చూస్తూ అనుకున్నాడు సబ్ ఇన్స్‌పెక్టర్ యశస్వి "లేదుసర్ మరణ వాంగ్మూలంతో ఆమె కథ ముగిసింది. ఇప్పుడు అసలు కథ ప్రారంభం కాబోయింది."

కథ ఎక్కడనుంచి ప్రారంభించాల్సిందీ ఆ క్షణంలోనే నిర్ణయించుకున్నాడు యశస్వి పట్టుదలగా.

పావని అంత్యక్రియలు ముగిసిన రెండో రోజు ఉదయం ఆరు గంటలవేళ....

సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రఘునాధరావుని ఇంటిదగ్గరే కలుసుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్ యశస్వి సీరియస్‌గా చెప్పుకుపోతున్నాడు.

"ప్రైమాఫేసీ ప్రకారం కోర్టులో చార్జిషీటు ఫైల్‌చేసి కేస్ క్లోజ్ చేయొచ్చు సార్....కాని ఇది ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన కాదు....ఇట్సే కేసాఫ్ మర్డర్...." రెండు రోజులు కేంప్ ముగించుకుని ఆ ముందురాత్రే ఇంటికి వచ్చిన రఘునాధరావు యశస్వి మాటలు అర్థం కానట్టుచూశాడు.

"ఏంటి నీకా నమ్మకం , కెన్ యూ ప్రూఫిట్" అన్నాడు సాలోచనగా.

"యస్సార్" చెప్పాడు నానీ ద్వారా తెలుసుకున్న 'క్లూ'ని.

ఇండియన్ ఎవిడెన్స్ ఏక్ట్ సెక్షను 32 ప్రకారం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డైయింగ్ డిక్లరేషన్ తీసుకున్నా అది అనుమానాస్పదంగా తోచినప్పుడు కేసుని తిరగతోడచ్చు. అంతవరకూ చార్జిషీటు ఫైలు చేయకుండా కోర్టులో గడువు కోరవచ్చు.

మరణ వాంగ్మూలాన్ని స్వయంగా నోట్ చేసుకున్న మేజిస్ట్రేట్ కోర్టులో దాని వివరాలు అందించిన మరుక్షణం నిజానికి కేసుకి అక్కడ శాశ్వతంగా తెరపడిపోతుంది.

కానీ యాదృచ్ఛికంగానయినా యశస్వి ఒక చిన్న తీగెను కదిపి కొత్త విషయాన్ని సేకరించగలిగాడు.

"వెల్....గో ఎ హెడ్ - సాధ్యమైనంత త్వరగా వివరాలన్నీ సేకరించు" అన్నాడు

రఘునాధరావు.

"థేంక్యూ సర్" ఒక మరణంతో సమాధి అయిపోయిన వాస్తవాన్ని బయటకి రాబట్టే ప్రోత్సాహానికి యశస్వి కంఠంలో  కృతజ్ఞత ధ్వనించింది. "కానీ చిన్న రిక్వెస్ట్ సర్"

రఘునాధరావు పచార్లు ఆపి వింటున్నట్టుగా చూశాడు.

"మూడు నాలుగు రోజుల్లో మొత్తం వివరాల్ని సేకరించగల్ను. కాని నా ఇంటరాగేషన్ లో దోషులనుకున్నవాళ్ళని పెద్దగా కంగారుపెట్టకుండా కేవలం ఈ హత్య వెనకవున్న మోటివ్స్‌ని మాత్రం తెలుసుకుంటాను."

"యూ మీన్...." అర్థంకాలేదు రఘునాధరావుకి ఏ విషయం స్పష్టం చేయాలని అతడు ప్రయత్నిస్తున్నదీ.

"ఇలాంటి నేరాల్లో దోషులు తెలివి మీరకుండా వుండాలీ అంటే నా ఇంటరాగేషన్ చాలా ఫార్మల్‌గా ముగిసిపోవాలి. వాళ్ళు ప్రస్తుతం అనుకుంటున్నది పావని ఇచ్చిన మరణ వాంగ్మూలంతో తమకు ప్రమాదం తప్పిపోయిందని. కేవలం ఆ ధైర్యంతోనే వాళ్ళు మామూలుగా కోర్టుకి వస్తారు.
మనం నిజంగా ఇవ్వాల్సిన జోల్ట్ అక్కడ, అంటే కోర్టులో....."

రఘునాధరావు భృకుటి ముడిపడింది.

"యస్సర్! నా ప్రిలిమినరీ ఎంక్వయిరీలో వాళ్ళకే మాత్రం అనుమానం వచ్చినా వాళ్ళు ఎలా ఎవరి ద్వారానో లేక తమంతట తాముగానో ఏం జవాబు చెప్పాలీ అన్నది ముందే ప్రిపేరైపోయే అవకాశముంది. దానితో నానీని సైతం ఇన్‌ఫ్లూయెన్స్ చేయొచ్చు.
వాళ్ళమీదే ఆధారపడి బ్రతికే నానీ ఈ కేసులో మనకి 'కీ విట్‌నెస్' కాబట్టి ఏ మాత్రం మనకు ప్రతికూలంగా సాక్ష్యమిచ్చినా కేసు వీగిపోతుంది. కాబట్టి...." ఓ క్షణం ఆగేడు "కోర్టులోనే వాళ్లని మెంటల్‌గా షటర్ చేయాలి. అంటే మనం చార్జిషీట్ లో రాసిన వివరాలని బట్టి దోషుల్ని అక్కడే కన్‌ఫ్యూజ్ చేసి అసలు నిజాన్ని  కక్కించాలి.
అఫ్‌కోర్స్ మన తర్కానికి సపోర్ట్‌గా నానీ ఎలాగూ వుంటాడు. సో మిమ్మల్ని రిక్వెస్టు చేసేదేంటంటే ఈ విషయాలన్నీ మీరు ముందుగానే పబ్లిక్ ప్రాసిక్యూటర్ తో మాట్లాడమని.
ఆయన సహకరిస్తే మన జాబ్ చాల సింప్లిపై అయిపోతుంది".